

చేతి పంపువద్ద నీళ్ల కోసం ఎదురు చూస్తున్న గ్రామస్తులు

# తాగు నీటి గోస తీర్చరూ..

కుమ్రం భీం ఆసిఫాబాద్, మార్చి 18 (నమస్తే తెలంగాణ) : ఆసిఫాబాద్ మండలంలోని బురద గూడెంలో తాగు నీటికి తిప్పలు తప్పడం లేదు. మిషన్ భగీరథ పైపులైన్ లీకేజీ వల్ల ట్యాంకు నిండడం లేదు. ఇక 30 కుటుంబాలకు ఒకే ఒక్క చేతి పంపు ఉండగా, అందులో భూగర్భ జలాలు అడుగంటి అవస్థలు పడాల్సి వస్తున్నది. రాత్రీ.. పగలూ అనే తేడా లేకుండా వంతుల వారీగా నీళ్లు పట్టుకోవాల్సిన దుస్థితి నెలకొందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి మిషన్ భగీరథ పైపులైన్‌కు మరమ్మతులు చేయించి తాగు నీటి కోస తీర్చాలని వారు వేడుకుంటున్నారు.

# వానకాలంలోగా గుండి వంతెన పూర్తి చేయాలి

**అసెంబ్లీలో ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి**



అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, మార్చి 18: వచ్చే వానకాలంలోగా ఆసిఫాబాద్ మండలంలోని గుండి వంతెనను పూర్తి చేయాలని ఎమ్మెల్యే కోవ లక్ష్మి అన్నారు. మంగళవారం ఆమె అసెంబ్లీలో నియోజక వర్గ సమస్యలపై మాట్లాడారు. గుండి వంతెన నిర్మాణం కోసం గత సర్కారులో రూ.8.50 కోట్లు మంజూరయ్యాయని, కాంట్రాక్టర్ అలసత్వం వల్ల పనులు పూర్తికాలేదన్నారు. కుమ్రం భీం ప్రాజెక్టు నుంచి విడుదల చేసిన నీళ్లు ఈ వంతెన పై నుంచి వెళ్లడంతో దెబ్బతిన్నదని, రీడిజైన్ కోసం రూ. 14 కోట్ల నిధులు అవసరమన్నారు. కొన్ని నెలల క్రితం జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క గుండి గ్రామాన్ని సందర్శించారని, త్వరితగతిన నిధులు మంజూరు చేసి వంతెన పూర్తి చేయాలన్నారు. లక్మాపూర్ వంతెన నిర్మాణం కూడా చేపట్టాలన్నారు. ఆసిఫాబాద్ నుంచి ఆదిలాబాద్ వెళ్లే రోడ్డు పూర్తిగా ధ్వంసమైందని, ఈ రోడ్డు గుండా మంత్రి సీతక్క కూడా ప్రయాణించారని, రోడ్డు పరిస్థితి గురించి ఆమెకు తెలుసని, వెంటనే నిధులు మంజూరు చేసి బాగు చేయాలని కోరారు. అలాగే కెరమెరిఘాట్‌లో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయని, ఇక్కడ రోడ్డు వెడల్పు కోసం అటవీశాఖ ద్వారా అనుమతులు వచ్చేలా కృషి చేయాలని ఎమ్మెల్యే కోరారు.

# రాత్రి పూట.. పన్నుల వేట



సోమవారం రాత్రి పన్నులు వసూలు చేస్తున్న మున్సిపల్ అధికారులు

- పన్నుల వసూళ్ల పేరిట చెన్నూర్ మున్సిపాలిటీ సిబ్బంది అత్యుత్సాహం
- రాత్రిపూట ఇండ్లపైకి వెళ్లి ట్యాక్స్ కట్టాలంటూ ఒత్తిడి
- మండిపడుతున్న ప్రజలు

చెన్నూర్, మార్చి 18 : చెన్నూర్ మున్సిపాలిటీ అధికారులు పన్నుల వసూళ్ల పేరిట అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారు. పగలూ.. రాత్రీ అనే తేడా లేకుండా ఇండ్లపైకి వెళ్లి ప్రజలపై తీవ్ర ఒత్తిడి తెస్తున్నారు. మార్చి నెలాఖరుకల్లా వందశాతం పన్నులు వసూలు చేసే లక్ష్యంతో అధికారులు వాడ వాడలా తిరుగుతూ ఇబ్బందులకు గురి చేస్తున్నారు. సోమవారం రాత్రి పట్టణంలోని విశ్వకర్మ వాడకు చెందిన ఓ వ్యక్తి ఇంటికి వెళ్లిన అధికారులు పన్ను చెల్లించాల్సిందేనంటూ జులుం ప్రదర్శించారు. రోజూ వారి కూలీనని.. ప్రస్తుతం పన్ను చెల్లించే స్థితిలో లేనని ఆయన అధికారులకు వివరించినా.. కనికరం చూపలేదు. ఇంటికి తాళం వేస్తాం.. సామాన్లు తీసి బయట పెడతాం...అంటూ బెదిరించారు. ఇక చేసేదేమి లేక అప్పటికప్పుడు చుట్టు పక్కల వారి వద్ద నుంచి అప్పు తెచ్చి పన్నులో కొంత మొత్తాన్ని చెల్లించాడు. అంతటితో ఆగని అధికారులు మార్చి నెలాఖరుకల్లా పన్ను మొత్తం చెల్లించాలని, లేదంటే పెద్ద సార్లు వస్తే ఇంకా ఇబ్బంది పడాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ విషయం పట్టణమంతా వ్యాపించడంతో మున్సిపాలిటీ అధికారుల తీరుపట్ల ప్రజలు తీవ్ర నిరసన వ్యక్తం చేస్తున్నారు. పన్నుల పేరిట ఇలా మొండిగా వ్యవహరించడం సరికాదని మండిపడుతున్నారు. ఈ విషయమై మున్సిపాలిటీ కమిషనర్ మురళీకృష్ణను వివరణ కోరేందుకు యత్నించగా అందుబాటులో లేరు.



కలెక్టరేట్ ముందు ధర్నా చేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు, వసతి గృహాల వర్కర్లు

# కలెక్టరేట్ ఎదుట కొనసాగుతున్న ఆందోళనలు

కుమ్రం భీం ఆసిఫాబాద్ (నమస్తే తెలంగాణ)/ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, మార్చి 18 : డిమాండ్లు నెరవేర్చాలని కోరుతూ అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, వసతి గృహాల్లో పనిచేసే కార్మికులు చేపడుతున్న ఆందోళనలు కొనసాగుతున్నాయి. మంగళవారం రెండో రోజూ స్థానిక కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. అసెంబ్లీ సమావేశాల్లో తమ సమస్యలపై చర్చించి న్యాయం చేయాలని వారు కోరారు. కార్మిక సంఘాల నాయకులు మాట్లాడుతూ అసంఘటిత కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మండిపడ్డారు. గిరిన ఆశ్రమ పాఠశాలలు, హాస్టళ్లలో పనిచేస్తున్న కార్మికులకు పాత పద్ధతిలోనే వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. పెరుగుతున్న నిత్యావసర సరుకుల ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని కోరారు. పెండింగ్ వేతనాలు వెంటనే విడుదల చేయాలని, జీవో 212ను అనుసరించి 2014 నాటికి ఐదేళ్లు నిండిన కార్మికులను వెంటనే పర్మినెంట్ చేయాలని, కొత్త మెనూ వల్ల పెరిగిన పని భారానికి అనుగుణంగా కార్మికుల సంఖ్య పెంచాలని, అంగన్‌వాడీకు కనీస వేతనం పెంచాలని, అర్హత కలిగిన వారిని రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. ఇకనైనా ప్రభుత్వం స్పందించాలని, లేదంటే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజేందర్, శ్రీకాంత్, అంగన్‌వాడీ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి త్రివేణి, నాయకులు గంగమని, అరుణ, స్వరూప, రాజేశ్వరి,కమల, అంజలి, మల్లేశ్వరి ఉన్నారు.

# మెరుగైన వైద్యమందించాలి



మండల వైద్యాధికారి రాజేందర్‌కు సూచనలిస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్

మందమర్రి, మార్చి 18 : వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించి రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలని మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్ పేర్కొన్నారు. మంగళవారం మందమర్రిలోని పాతబస్టాండ్ ఏరియాలో గల పీహెచ్‌సీని సందర్శించారు. వార్డులు, ల్యాబ్, మందుల నిల్వలు, రిజిస్టర్లను పరిశీలించారు. ప్రజలకు అందిస్తున్న సేవల గురించి డాక్టర్ రాజేందర్‌ను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ పీహెచ్‌సీలో అవసరమైన మందులు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. వేసవిలో వడదెబ్బ బారిన పడకుండా పాటించాల్సిన జాగ్రత్తలను ప్రజలకు వివరించాలని సూచించారు. అనంతరం మున్సిపాలిటీ కార్యాలయాన్ని సందర్శించి రికార్డులు పరిశీలించారు. ఈ ఏడాది వంద శాతం ఆస్తిపన్నులు వసూలు చేయాలని కమిషనర్ తుంగపిండి రాజలింగును ఆదేశించారు. ఎల్‌ఆర్‌ఎస్-2020 పథకంలో దరఖాస్తు చేసుకున్న వారి నుంచి రుసుము వసూలు చేయాలన్నారు.



ఇసుక అక్రమ రవాణా చేస్తూ పట్టుబడిన ట్రాక్టర్



బీట్ అధికారి బైక్‌పై డంప్ చేసిన ఇసుక, అన్‌లోడ్ చేస్తున్న స్థానికులు



ఇటీవల పట్టుబడిన జేసీబీ

# జోరుగా ఇసుక దందా

**అటవీశాఖ పరిధిలోని వాగుల నుంచి యథేచ్ఛగా అక్రమ రవాణా**

- రాత్రికి రాత్రే తరలిస్తున్న మాఫియా
- అధికారులు, ప్రజాప్రతినిధుల అండదండలతో రెచ్చిపోతున్న వైనం!
- అడ్డువచ్చిన అధికారులపైనా దాడులు
- ఇటీవల భీమారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన బీట్ ఆఫీసర్ భానేశ్



**అటవీ సంపదను దోచుకుంటే ఊరుకోం**

అటవీ సంపదను దోచుకుంటే కఠినంగా చర్యలు తీసుకుంటాం. గతంలో దాంపూర్‌లో ఇసుక అక్రమార్కులపై కేసులు నమోదు చేశాం. పోలీసులు కూడా కేసు నమోదు చేశారు. నోటీస్‌లు కూడా జారీ చేశాం. అక్రమార్కులు నోటీసులు తీసుకోలేదు. ఇసుక అక్రమ రవాణా చేసిన ట్రాక్టర్ ఇంకా బయటే ఉంది. పోలీసులు ట్రాక్టర్‌ను అదుపులోకి తీసుకోకపోతే కోర్టుకెళ్తాం.

**- మంచిర్యాల ఎఫ్ఆర్వో రత్నాకర్‌రావు**

భీమారం, మార్చి 18 : భీమారం, బూర్గుపల్లి, ఖాజీపల్లి, ధర్మారం, పోలంపల్లి శివారు ప్రాంతాల్లోని వాగుల నుంచి ఇసుక యథేచ్ఛగా తరలిపోతున్నది. రాత్రి వేళల్లో రెచ్చిపోతున్న ఇసుక మాఫియా జేసీబీలతో తవ్వి మరీ ట్రాక్టర్లలో రవాణా చేస్తూ అందినకాడికి దండుకుంటున్నది. అటవీశాఖ అనుమతి లేకుండా ఆయా ప్రాంతాల్లోని వాగుల నుంచి ఇష్టారాజ్యంగా తోడుకెళ్తూ ఒక్కో ట్రిప్పునకు రూ. 2500 చొప్పున విక్రయిస్తున్నది. రాజకీయ నాయకులు, అధికారుల అండదండలతోనే ఈ దందా సాగుతుందనే ప్రచారమున్నది. భీమారం గ్రామ పంచాయతీ పరిధిలో మూడు గ్రూపులు ఏర్పడి ఈ వ్యవహారాన్ని నడిపిస్తున్నట్లు తెలుస్తున్నది. గత నెల 25న భీమారం మండలం దాంపూర్ అటవీ ప్రాంతం నుంచి రాత్రి ఇసుక తరలిస్తున్నట్లు సమాచారమందగా, అక్కడికి వెళ్లిన బీట్ అధికారి భానేశ్‌పై కొంతమంది అక్రమార్కులు దాడి చేయడం కలకలం రేపింది. మరుసటి రోజు (26వ తేదీ) స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆయన ఫిర్యాదు చేశారు. తమపై హత్యాయత్నం చేశారని, తాము నడుపుతున్న ద్విచక్ర వాహనంపై ఇసుక డంప్ చేశారని ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారు. అదే రోజు తెల్లవారు జామున భీమారం అటవీ ప్రాంతంలో ఇసుక అక్రమ రవాణా చేస్తున్న జేసీబీతో పాటు ట్రాక్టర్‌ను అటవీశాఖ అధికారులు పట్టుకుని సీజ్ చేశారు. మొత్తం 7 ట్రాక్టర్లలో ఇసుక తరలిస్తున్నట్లు తెలియగా, ఇందులో ట్రాక్టర్‌తో పాటు జేసీబీ మాత్రమే దొరికింది. అంతకు ముందే అటవీశాఖలోని కొందరు అవినీతిపరులు ఇసుక మాఫియాకు ముందస్తు సమాచారం ఇచ్చారని, అందువల్లే మిగతా ట్రాక్టర్లు దొరకకుండా పోయాయని తెలిసింది. ఇక ఇటీవల ఇసుక తరలింపు విషయమై రెండు వర్గాల మధ్య ఘర్షణ కాగా, ఒకరిపై ఒకరు పోలీసులకు ఫిర్యాదు చేసుకున్నారు. ఓ ట్రాక్టర్ యజమానిపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆయా వర్గాల మధ్య గొడవ జరిగిన నేపథ్యంలో ఓ పోలీసు అధికారి రాజీ కుదుర్చేందుకు తీవ్ర ప్రయత్నాలు చేశారని, ఓ కానిస్టేబుల్ ద్వారా ఇరువర్గాలకు రాయబారం పంపారని తెలుస్తున్నది. ఓ కాంగ్రెస్ నాయకుడికి ఈ వ్యవహారాన్ని అప్పగించినట్లు కూడా ప్రచారమవుతున్నది.

**అభివృద్ధి పేరిట..**

కొంత మంది అభివృద్ధి పనుల పేరిట అటవీశాఖ భూముల్లోని వాగుల నుంచి అక్రమంగా ఇసుక తరలించుకుపోతున్నారు. సీసీ రోడ్లు, డ్రైనేజీలు, భవనాల సముదాయాలకు ఇసుక అవసరముందని చెప్పి దందా సాగిస్తున్నారు. కొందరు కాంగ్రెస్ నాయకులతో పాటు అధికారులు సైతం దందాకు సహకరిస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.



మైలారం వాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్

# అభివృద్ధి పేరిట అక్రమం

**నెన్నెల మండలంలోని వాగుల నుంచి ఇసుక తరలింపు**

- బోర్లు అడుగంటుతున్నాయంటూ రైతుల ఆవేదన
- 'మాములు'గా తీసుకుంటున్న అధికారులు

నెన్నెల,మార్చి 18 : నెన్నెల మండలంలోని పలు వాగుల నుంచి జోరుగా ఇసుక తరలిపోతుండగా, అధికారులు 'మామూలు'గా తీసుకోవడం విమర్శలకు తావిస్తున్నది. కొందరు అభివృద్ధి పనుల పేరిట మైలారం, ఖర్జీ, నెన్నెల గుండ్ల సోమారం వాగుల నుంచి రాత్రీ.. పగలూ అనే తేడా లేకుండా ట్రాక్టర్లలో రవాణా చేస్తూ సొమ్ముచేసుకుంటున్నారు. మైలారం వాగు నుంచి నేరుగా ఆవుడం, చిత్తాపూర్, గంగారం గ్రామాలతో పాటు మందమర్రి మండలంలోని చుట్టు పక్కల గ్రామాలకు తీసుకెళ్లి అమ్ముకుంటున్నారు. ఇక గుండ్ల సోమవారం, ఖర్జీ నుంచి నేరుగా బెల్లంపల్లికి తీసుకుపోతున్నారు. అక్రమ దందాపై మైనింగ్ అధికారులకు సమాచారమిస్తే.. వారే ట్రాక్టర్ల యజమానులకు ఫోన్ చేసి తప్పించుకోండని చెబుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎక్కడ పడితే అక్కడ ఇసుక డంప్‌లు ఏర్పాటు చేస్తున్నా.. అటు మైనింగ్.. ఇటు రెవెన్యూ, పోలీస్ అధికారులు పట్టించుకోవడంలేదని ప్రజలు, రైతులు మండిపడుతున్నారు. మైనింగ్ అధికారులు ట్రాక్టర్లను పట్టుకోవడానికి వస్తున్నట్లు తెలిసి.. ఎఫ్ఆర్వోలు ముందస్తుగా యజమానులకు సమాచారమందిస్తున్నట్లు ప్రజలు ఆరోపిస్తున్నారు.

**బోర్లు అడుగంటుతున్నాయి**

వాగుల నుంచి ఇసుక తరలించుకుపోవడం వల్ల బోర్లలోని నీరు అడుగంటి పంటలు ఎండిపోయే ప్రమాదముందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అసలే ఎండాకాలమని.. ఇష్టారాజ్యంగా ఇసుక తోడడం వల్ల భూగర్భ జలాలు అడుగంటి పంటలు చేతికందకుండా పోయే అవకాశముందని వారు వాపోతున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలని వారు వేడుకుంటున్నారు.



రైల్వే గేటుకు అంటించిన నోటీసు

## నేటి నుంచి రైల్వే గేటు మూసివేత

రామకృష్ణాపూర్, మార్చి 18 : జిల్లాలోని క్యాతనపల్లి మున్సిపాలిటీ కార్యాలయ సమీపంలోని రైల్వే గేటును బుధవారం నుంచి పది రోజుల పాటు మూసివేయనున్నట్లు రైల్వే అధికారులు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ట్రాక్ మరమ్మతుల కారణంగా గేటు నం-57(లెవల్ క్రాసింగ్)ను ఈ నెల 28వ తేదీ వరకూ మూసి వేయనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే అధికారులు తెలిపారు. ఈ మార్గంలో వెళ్లే వారంతా ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకోవాలని తెలిపారు.

# రూ. 3 లక్షల స్వాహాకు ఏపీఎం స్కెచ్

- ఇతర గ్రూపునకు డబ్బులు ట్రాన్స్‌ఫర్ చేస్తూ దొరికిపోయిన అధికారి
- నిలదీసిన మహిళా సంఘం సభ్యులు
- రెండు రోజుల్లో డబ్బులు తిరిగి చెల్లిస్తానని చెప్పడంతో శాంతించిన వైనం

కన్నెపల్లి, మార్చి 18 : ఓ ఏపీఎం మహిళా సంఘాల సభ్యులను మోసం చేసి రూ. 3 లక్షలు కాజేసేందుకు స్కెచ్ వేసి విఫలమయ్యాడు. వివరాల్లోకి వెళ్తే.. మంచిర్యాల జిల్లా కన్నెపల్లి మండలం వీరాపూర్ గ్రామానికి చెందిన శ్రీలక్ష్మి స్వయం సహాయక సంఘం సభ్యులు తమ అవసరాల కోసం స్త్రీనిధి ద్వారా రూ. 7 లక్షల అప్పు ఇవ్వాలని ఏపీఎం అశోక్‌ను కోరారు. ఇందుకు ఆయన ఒప్పుకున్నాడు. ఏడుగురు సభ్యులకు రూ. 7 లక్షలు ఇస్తానని చెప్పి.. వారిని కన్నెపల్లి బ్యాంకుకు పిలిపించాడు. రూ. 7 లక్షలకు బదులు రూ. 10 లక్షలు అప్పుగా చూపించి.. ఇందులో రూ. 3 లక్షలను భీమన్న ఎస్‌హెచ్‌జీ ఖాతాకు ట్రాన్స్‌ఫర్ చేశాడు. శ్రీలక్ష్మి ఎస్‌హెచ్‌జీకి చెందిన ఓ మహిళా సభ్యురాలి కుమారుడు దీనిని గమనించాడు. వాళ్లకు ఇవ్వాల్సినవి రూ. 7 లక్షలేనని, మీరు మరో రూ. 3 లక్షలు ఇతర గ్రూపు సభ్యులకు ఎందుకు ట్రాన్స్‌ఫర్ చేశాని నిలదీయగా, నీకు ఏం తెలియదంటూ బెదిరించి అక్కడి నుంచి పంపించాడు. బ్యాంకు నుంచి వీరాపూర్ చేరుకొని ఇతర సభ్యులకు తెలియజేయగా, శ్రీలక్ష్మి ఎస్‌హెచ్‌జీ సభ్యులు ఏపీఎం అశోక్‌ను నిలదీశారు. అయినా, వినకపోవడంతో కన్నెపల్లి పోలీసులకు ఫోన్ చేయగా, విషయం బయటకు పొక్కకుండా ఉండేందుకు ఏపీఎం అప్రమత్తమయ్యాడు. మిగతా డబ్బులు రెండు రోజుల్లో ట్రాన్స్‌ఫర్ చేస్తానని ఆయన ఒప్పుకోవడంతో సభ్యులు శాంతించారు. కాగా, ఏపీఎం డబ్బులను తన సొంతానికి వాడుకోవాలని అనుకోవడం విస్మయానికి గురి చేస్తున్నది. కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలో పనిచేస్తున్నప్పుడు అవినీతి ఆరోపణలు రావడంతో, ఇటీవల భీమిని మండలానికి ఆయనను బదిలీ చేశారు. అక్కడ కూడా అవినీతి ఆరోపణలు రావడంతో మంచిర్యాల డీఆర్‌డీవోకు సరెండర్ చేశారు. అనంతరం కన్నెపల్లిలో పోస్టింగ్ ఇచ్చారు. అయినా ఏపీఎంలో మార్పు రాలేదని పలువురు పేర్కొంటున్నారు. ఏపీఎంతో పాటు ఇక్కడ పనిచేస్తున్న కంప్యూటర్ ఆపరేటర్‌పైనా అవినీతి ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఉన్నతాధికారులు విచారణ జరిపి తగు చర్యలు తీసుకోవాలని కోరారు. కాగా, ఈ విషయంపై ఏపీఎం అశోక్‌ను వివరణ కోరగా స్పందించడానికి నిరాకరించాడు.